## దటీజ్ తెలంగాణ

తొమ్మిదిన్నరేండ్లలో కేంద్రం చేపట్టిన 1763 మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో డెడ్‌లైన్ పూర్తయినప్పటికీ ఇంకా 842 ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగుతూనే ఉన్నది. అదే సమయంలో మన దగ్గర కాళేశ్వరం భారీ ప్రాజెక్టు పూర్తయ్యింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల, సీతారామ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

సంక్షేమం



సహకార బ్యాంకుల నుంచి ఎదురయ్యే వేధింపుల నుంచి రైతన్నలు విముక్తి పొందటానికి కేసీఆర్ సర్కారు రుణమాఫీని తీసుకొచ్చింది. 2023లో కూడా రెండోసారి రుణమాఫీతో ఇప్పటివరకు దాదాపు 55 లక్షల మంది రైతులకు రూ. 24 వేల కోట్ల రుణాన్ని మాఫీ చేసింది.

రెండోసారి రుణమాఫీ

పథకం ప్రారంభం **2014**

లబ్ధిదారులు **55** లక్షల మంది

## మనమే నెంబర్ 1




# ఏడాదికి 10,000 మంది డాక్టర్లు

ప్రభుత్వ, ప్రైవేటు కలిపితే 2014కు ముందు తెలంగాణలో 20 మెడికల్ కాలేజీలు, 2,850 సీట్లు మాత్రమే ఉండేవి. ఈ ఏడాది ఆ సంఖ్య 56కు పెరిగింది. సీట్లు 8,340కు చేరింది. వచ్చే ఏడాది కోసం ప్రభుత్వం ఇప్పటికే మరో 8 మెడికల్ కాలేజీలను మంజూరు చేసింది. అవి కూడా కలిపితే, సీట్ల సంఖ్య 9,140కి చేరుతుంది. వచ్చే ఏడాది అందుబాటులోకి వచ్చే ప్రైవేటు కాలేజీలను కూడా కలిపితే రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య పదివేలు దాటనున్నది. అంటే.. సంవత్సరానికి తెలంగాణ నుంచి 10 వేల మంది డాక్టర్లు తయారు కానున్నారు.

**తొమ్మిదిన్నరేండ్లలో ఎంబీబీఎస్ సీట్లలో మార్పు ఇది**

2014
**2,850** ఎంబీబీఎస్ సీట్లు

2023
**8,340** ఎంబీబీఎస్ సీట్లు

పెరుగుదల **192%**

**ప్రభుత్వ ఎంబీబీఎస్ సీట్లలో మార్పు ఇలా**

2014లో
**850** సీట్లు

ప్రస్తుతం సీట్లు
**3,790** ఎంబీబీఎస్ సీట్లు

పెరుగుదల **346%**

**విశేషం**
ఇప్పటికే ప్రతీ లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లతో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నది. వచ్చే ఏడాది సీట్ల సగటు మరింత పెరగనున్నది. 2023-24 ఏడాది దేశంలో అందుబాటులోకి వచ్చిన మొత్తం ఎంబీబీఎస్ సీట్లలో తెలంగాణ వాటా 43 శాతంగా ఉన్నది.

‘సమస్య ఉన్న చోటే సాహిత్యం పుడుతుంది. అణచివేత ఉన్న చోటే అగ్గి రాజుకుంటుంది. పీడన ఉంటేనే పోరు పుడుతుంది. అనాదిగా అవనిపై జరుగుతున్నది ఇదే. పోతన, వేమన నుంచి మొదలుకొని కారల్‌మార్క్స్‌ వరకు గొప్ప రచయితలు, కవుల సాహిత్యం అజరామరంగా నిలిచింది అంటే.. వారు ఎంచుకున్న సాహిత్య కథావస్తువే దానికి కారణం. అయితే సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో కథా వస్తువులు కరువయ్యాయి’ అంటున్నారు ప్రముఖ కథా, నవలా రచయిత, ఉపాధ్యాయుడు, జగిత్యాల వాసి కేవీ నరేందర్. అప్పటి సంక్షోభ తెలంగాణ.. సొంత రాష్ట్రంలో సంక్షేమ తెలంగాణగా మారిందని చెబుతున్న ఆయన ‘నమస్తే తెలంగాణ’తో తన అభిప్రాయాలను పంచుకున్నారు.



# కథా వస్తువులు కరువైనయ్

## ప్రజా సమస్యలుంటేనే కదా సాహిత్యముండేది

### కేసీఆర్ పాలనలో ప్రజల కష్టాలు దూరం.. ప్రముఖ కథా, నవలా రచయిత కేవీ నరేందర్

**కవులు, రచయితల సంఖ్య తగ్గిపోవడానికి కారణమేంటి?**

‘మాకొద్దీ తెల్ల దొరతనం’ అని గరిమెల్ల అన్నా.. ‘తీగలను తెంచి అగ్గిలోన దించినావు’ అంటూ దాశరథి నినదించినా.. ‘బండెనక బండి కట్టి’ అంటూ యాదగిరి గొంతెత్తినా ప్రజా సమస్యలను మూలవస్తువుగా చేసుకొనే. ఉమ్మడి పాలనలో తెలంగాణ ప్రజల సాగు, తాగు నీటి వెతలు, బొగ్గుబాయి కష్టాలు, కరెంట్ కోతలు, పూడిపోయిన చెరువులు, బావులు, పట్టెడన్నం కోసం సాగించిన పోరాటం.. వారి త్యాగం తదితర అంశాలన్నీ సాహిత్యానికి కథా వస్తువులుగా స్వీకరించేవారం. అయితే స్వరాష్ట్రంలో ప్రజల సమస్యలు పరిష్కారమయ్యాయి. అందుకే రచయితలకు బలమైన కథావస్తువులు దొరకడం లేదు.

**అప్పటి, ఇప్పటి తెలంగాణకు తేడా ఏంటి?**

ఉమ్మడి పాలకులు తెలంగాణను అంతర్గత వలస ప్రాంతంగా భావించారు. వనరులను కొల్లగొట్టారు. సంస్కృతిని అవమానించారు. మాండలికాన్ని తుర్కాంధ్రం అంటూ తక్కువ చేశారు. అప్పటి సంక్షోభ తెలంగాణ.. స్వరాష్ట్రం వచ్చాక సంక్షేమ తెలంగాణగా మారింది. ఈ పదేండ్లలో దోపిడీ లేదు. పీడన లేదు. ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందుతున్నది.

**ఒక కథా రచయితగా ప్రస్తుత తెలంగాణ ఎలా కనిపిస్తున్నది?**

పదేండ్ల తెలంగాణను చూసి సంబురం అయితుంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఆదర్శ తెలంగాణగా అవతరిస్తున్నాం. సీఎం కేసీఆర్ పాలనలో కవులు, కథా రచయితలకు సాహిత్య వస్తువు దొరకడం లేదు. సమస్య ఉంటేనే కదా సాహిత్యం పుట్టేది. తెలంగాణ రాకముందు రైతు ఆత్మహత్యలు ఉండేవి. ఆ నేపథ్యంలో సాహిత్యం వచ్చింది. రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలతో అన్నదాతల జీవితాలు పచ్చటి పొలాలుగా మారిపోయాయి. చేనేత కార్మికులు బంగారం, వెండితో చీరలు నేస్తున్నారు. కరెంటు కష్టాలు రాద్దామంటే.. తీగలను కాదు కదా, ఆ సబ్జెక్టుని ముట్టుకుంటేనే షాక్ తగిలేంతగా కరెంటు ఉంటున్నది. ఎక్కడో ఒక చోట, ఎవరో ఒకరికి అన్యాయం జరగొచ్చు. కోట్ల రూపాయల పథకంలో వంద రూపాయల నష్టం జరిగిందని గగ్గోలు పెట్టడం సరికాదు.

**ప్రస్తుత రాజకీయ పరిణామాలపై మీ అభిప్రాయం?**

రాజకీయం అంటే సంక్షేమం ఒక్కటే కాదు.. అభివృద్ధితో పాటు, అనేక అంశాల కలబోత. నేటి రాజకీయ నేతలకు వ్యక్తిగత స్వార్థం తప్ప.. ప్రజల ప్రయోజనాలు పట్టడం లేదు. ఇటు నుంచి అటు గెంతే కప్పల్లాగా పార్టీలు మారుతున్నవారు అధికమయ్యారు. ఒక రాజకీయ నాయకుడు పార్టీ మారుతున్నాడంటే.. వ్యక్తిగత లాభం కోసమా? లేదా ప్రజా సంక్షేమం కోసమా? అనేది ప్రజలు ఆలోచించి ఓటెయ్యాలి.

**ఓటు విలువ గురించి ఏం చెబుతారు?**

ఓటు పవిత్రమైనది. యాభై ఏండ్ల క్రితం ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, ఓటు వేయకపోయినా అవమానంగా భావించేవారు. ఒకరకంగా చనిపోయినట్టు అనుకునేవారు. ప్రస్తుతం అక్షరాస్యులు, మేధావులు, ఉద్యోగులు, సినిమా యాక్టర్లు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారు. ఇది అత్యంత బాధాకరం.

**నేటి నాయకుల గురించి ఏమనుకుంటున్నారు.?**

రాజకీయ నాయకుడంటే సీఎం కేసీఆర్‌లాగా ఉండాలి. దీనికి నా వ్యక్తిగత అంశమే ఉదాహరణ. 2016లో నాకు పార్కిన్సన్ వ్యాధికి సంబంధించి ఆపరేషన్ జరిగింది. రూ.14 లక్షలు ఖర్చయ్యాయి. ఆ తర్వాత జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో నేనూ పాల్గొన్నా. కార్యక్రమానికి హాజరైన సీఎం కేసీఆర్ విషయం తెలుసుకొని వెంటనే రూ.15 లక్షల చెక్ ఇచ్చారు. ‘మాకు ఒక నాయకుడు ఉన్నాడు’ అని రచయితలందరికీ అప్పుడు ధైర్యం వచ్చింది.

... మహేశ్ కుమార్ కొత్తూరి

## సోషల్ యాంగిల్



ఓటుకు నోటు కేసు నాకొక మెడల్
కర్ణాటకే నా రోల్ మోడల్
తెలంగాణకు కష్టాలే నా ‘కరెంట్’ ప్రొఫైల్

తెలంగాణను గెల్వాలని కాంగిరేసు..
తెలంగాణను గెలిపించాలని బీఆర్ఎస్..
గీ ముచ్చట ముంగటేస్కున్న నల్గురు..
రిస్క్ వద్దు.. మర్సిపోకుంట మళ్లోసారి గుద్దు..
అని అన్కుంట పెదవులు బిగ్గర వట్టిండ్రు




టెలిఫోన్ దిక్కు జూస్తె టెలీకం స్కాం..
నెట్‌వర్క్ దిక్కు జూస్తె 2జీ స్కాం..
భూమీద బోఫోర్స్ స్కాం..
భూమి లోపల బొగ్గు స్కాం..
ఎటు సూసినా అర‘చేతి’లో అన్నీ స్కాములే..
అందరిళ్లల్లో బీఆర్ఎస్ స్కీములే..
సోచాయించుండ్రి ఇగ..!

- సురేందర్ బండారు

సమాజంలోని అందరికీ సమాన ప్రాతిపదికన నాణ్యమైన విద్యను అందించడానికి తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు చేపట్టింది. ‘తొలిమెట్టు’ కార్యక్రమంతో బడుల్లో మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేస్తున్నది. ఆంగ్ల బోధనా భాషను 2024-25 నాటికి 1 నుంచి 10వ తరగతి వరకు పటిష్టంగా అమలు చేయాలని నిర్ణయించింది.

# నాణ్యమైన విద్యకు తొలిమెట్టు



నాణ్యమైన విద్యను సమాన ప్రాతిపదికన అందరికీ అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. ఇందులో భాగంగా 2022-23లో ‘తొలిమెట్టు’ కార్యక్రమాన్ని ప్రారంభించింది. మెరుగైన ఫలితాలు సాధించడం, ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని బలోపేతం చేయడం ద్వారా పిల్లలను సన్నద్ధం చేయడం ‘తొలిమెట్టు’ ఉద్దేశం. అన్ని పాఠశాలల్లో ప్రాథమిక భాష, గణిత నైపుణ్యాలను ఒక మిషన్ మోడ్‌లో అభ్యసించడానికి, గ్రేడ్ స్థాయికి సమానంగా కనీస సామర్థ్యాన్ని సాధించడానికి 1-5 తరగతులకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. 2024 నాటికి సార్వత్రిక (ఫౌండేషనల్ లిటరసీ న్యూమరసీ) సాధించాలనే లక్ష్యంతో దీనిని రూపొందించారు. ఉపాధ్యాయుల అందుబాటు, ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించే అంశం, ప్రాథమిక స్థాయిలో 2021-22 ప్రకారం విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తిలో 20:1తో తెలంగాణ మూడో స్థానంలో ఉన్నది.

ఎగువ ప్రాథమిక, ద్వితీయ స్థాయి కోసం, ప్రత్యేక వర్గీకరణ కాని రాష్ట్రాల్లో వరుసగా 13:1 - 9:1 విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తితో తెలంగాణ ఉత్తమ పనితీరు కనబరిచింది. విద్యలో మౌలిక సదుపాయాలు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ’మన ఊరు-మన బడి’/ ‘మన బస్తీ-మన బడి’ని ప్రారంభించింది. ప్రభుత్వ పాఠశాలల్లో 12 రకాల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ఈ పథకం లక్ష్యం. జనవరి 2022లో ప్రారంభించిన ఈ పథకం మూడు దశల్లో మూడేండ్ల పాటు కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. రూ.7,289.54 కోట్ల బడ్జెట్‌తో 26,065 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. తొలిదశలో 14.72 లక్షల మంది విద్యార్థులు, 123 పాఠశాలలకు రూ.3,497.62 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు.

2021-22 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో దాదాపు 62.29 లక్షల మంది పిల్లలు చేరారు. వీరిలో 50.23% మంది ప్రైవేట్ పాఠశాలలు, 49.77% మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. 2020-21లో 43.47% నుంచి 2021-22లో 49.77%కు నమోదు పెరిగింది. దీనిని మరింత మెరుగుపరచడానికి 2022-23 విద్యా సంవత్సరంలో 1 నుంచి 8 తరగతులకు ఆంగ్లంలో బోధన ప్రారంభించారు. 2024-25 నాటికి 10వ తరగతి వరకు ఇంగ్లిష్‌లో బోధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

... భరద్వాజ

## ఎటెళ్లినా.. లింకు దారి..



హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం మెట్రో, ఫ్లై ఓవర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే, రోజురోజుకు జనాభా, వాహనాలు పెరుగుతుండటంతో ‘మిస్సింగ్ లింక్స్ ప్రాజెక్టు’ పేరుతో నగరంలో లింకు రోడ్ల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రెండు దశల్లో వివిధ ప్రాంతాల్లో రోడ్లను అభివృద్ధి చేయగా, మూడో దశలో భాగంగా రూ.2,410 కోట్లతో 104 లింక్ రోడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

ఓటర్ కీ బాత్

## అన్ని రంగాలకు అనువైన నగరం



వ్యాపార, వాణిజ్య, జీవనోపాధికి హైదరాబాద్ కేరాఫ్‌గా మారింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత వచ్చిన మార్పులు కండ్లముందు కదలాడుతున్నాయి. అతి తక్కువ సమయంలో ఇంత అభివృద్ధి జరుగుతుందని అనుకోలేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ఎప్పటికీ ప్రజల మదిలో నిలిచిపోతాయి. నిరుపేదల కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నది బీఆర్ఎస్ ప్రభుత్వం. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధిని చేపట్టడం అభినందనీయం. హైదరాబాద్‌ను చూసి ఇతర రాష్ట్రాలు, నగరాల నుంచి వ్యాపారం, జీవనోపాధి కోసం వస్తున్నారు.

- విజయ్‌కుమార్, సీతాఫల్‌మండి

# రెండు వేల మందికి భూ పట్టాలు


## రూ.93 కోట్లతో ఎత్తిపోతల నిర్మాణం.. రూ.77 కోట్లతో జాతీయ రహదారి విస్తరణ

### నడిపెల్లి దివాకర్‌రావు గెలుపు నల్లేరు మీద నడకే.. బీఆర్ఎస్ హయాంలో మంచిర్యాలకు మహర్దశ

*మంచిర్యాల నియోజకవర్గంలో రూ.1,500 కోట్లతో 9,406 అభివృద్ధి పనులను చేపట్టారు. వన్‌టౌన్, టూటౌన్ మధ్య రూ. 8 కోట్లు వెచ్చించి రైల్వే అండర్ బ్రిడ్జిని నిర్మించారు. రూ.34 కోట్లతో 4వ కడెం డిస్ట్రిబ్యూటరీ కాల్వ లైనింగ్ పనులు చేపడుతున్నారు. రూ.93 కోట్లతో హాజీపూర్ వద్ద ఎత్తిపోతలను నిర్మించనున్నారు. 186 ఎకరాల సింగరేణి స్థలంలో 2,000 మందికి పట్టాలు పంపిణీ చేశారు.*

*1952లో లక్సెట్టిపేట అసెంబ్లీ కేంద్రంగా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాలను నియోజకవర్గంగా మార్చారు. మొదటి సారి ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి గడ్డం అరవిందరెడ్డి గెలుపొందారు. 2014, 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన నడిపెల్లి దివాకర్‌రావు తాజా ఎన్నికల్లోనూ అధికార పార్టీ తరఫున పోటీ చేస్తున్నారు.*

మంచిర్యాల



విద్యుత్తు వెలుగుల్లో మంచిర్యాల కలెక్టరేట్

రూ.164 కోట్లతో గోదావరిపై వంతెన

సింగరేణి కోల్‌బెల్ట్ నస్పూర్, శ్రీరాంపూర్ ఏరియాలో 40 ఏండ్లుగా 186 ఎకరాల సింగరేణి స్థలంలో నివాసం ఉంటున్న కార్మికులు, కార్మికేతర ప్రజలకు సీఎం కేసీఆర్ యాజమాన్య పట్టాలు అందజేశారు. ఈ ప్రాంతాల్లో 3,300 మంది కార్మికులు, కార్మికేతర కుటుంబాలు నివసిస్తున్నాయని అధికారులు సర్వేలో తేల్చారు. వీరిలో ఇప్పటివరకు 2,000 మందికి పట్టాలు పంపిణీ చేశారు.

**బీఆర్ఎస్ హయాంలో మారిన రూపురేఖలు**

తొమ్మిదిన్నరేండ్లలో నియోజకవర్గంలో రూ. 1,500 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టారు. 1,30,811 మందికి సంక్షేమ ఫలాలు అందజేశారు. రహదారుల విస్తరణ, వంతెనలు, నూతన రహదారులు, పట్టణాల్లో సుందరీకరణ పనులు చేపట్టడంతో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నది.

**రూ. ఏడున్నర కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు**

మంచిర్యాల, లక్సెట్టిపేట, నస్పూర్ మున్సిపాలిటీల్లో ఒక్కో చోట రూ. ఏడున్నర కోట్లు వెచ్చించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను నిర్మిస్తున్నారు. వన్‌టౌన్, టూటౌన్‌ల మధ్య రూ. 8 కోట్లతో రెండు వరుసల రైల్వే అండర్ బ్రిడ్జిని నిర్మించారు. రూ.140 కోట్లతో మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నారు.

**రోడ్ల నిర్మాణం, విస్తరణ..**

రూ.47 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు వెచ్చించి మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీల్లో రోడ్లు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనులను చేపట్టారు. రూ.13 కోట్లతో మంచిర్యాల లక్ష్మీ టాకీసు నుంచి వైశ్యభవన్ వరకు బైపాస్ రోడ్డు నిర్మించారు. మంచిర్యాలలో రూ.15 కోట్లతో రహదారుల విస్తరణ చేపడుతున్నారు. రూ.17 కోట్లతో మంచిర్యాలలో మాతాశిశు దవాఖాన నిర్మాణం పూర్తికాగా, రూ.8 కోట్లతో లక్సెట్టిపేటలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ చేశారు.

**రూ.93 కోట్లతో హాజీపూర్ వద్ద ఎత్తిపోతల**

ఇరిగేషన్ శాఖ నుంచి రూ.34 కోట్లు వెచ్చించి 4వ కడెం డిస్ట్రిబ్యూటరీ కాల్వ లైనింగ్ పనులు చేపడుతున్నారు. రూ.93 కోట్లతో హాజీపూర్ వద్ద ఎత్తిపోతలను నిర్మించనున్నారు. రూ.164 కోట్లతో మంచిర్యాల - అంతర్గాం మధ్య గోదావరి నదిపై వంతెన ఏర్పాటు చేయనున్నారు. మంచిర్యాలలో రూ.59 కోట్లతో భగీరథ పనులు చివరి దశలో ఉన్నాయి. రూ.35 కోట్లతో ఐబీ చౌరస్తా నుంచి శ్రీనివాస టాకీసు వరకు ఆరు వరుసల రహదారి, రంగంపేట వద్ద రూ.12 కోట్లతో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.

... వేముల కుమారస్వామి